సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం : 23 : ఏప్రిల్ : 2024



బీజేపీ భారీ బైక్ ర్యాలీ
నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి నామినేషన్ సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. - 8లో



కొట్లాడేది కేసీఆరే..
తెలంగాణ ప్రజల కోసం కొట్లాడేది కేసీఆరేనని నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. - 8లో

గరిష్టం / కనిష్టం
41° / 26°
వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు బీజేపీ నామినేషన్ యాత్ర

భువనగిరి : బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ భువనగిరి లోక్‌సభ స్థానానికి మంగళవారం నామినేషన్ వేయనున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో విజయ సంకల్ప నామినేషన్ యాత్ర నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు యాత్ర ప్రారంభం కానుందని, హైదరాబాద్ చౌరస్తా నుంచి సాయిబాబా ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. అతిథులుగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్య సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మహాశివుడికి ఘనంగా రుద్రాభిషేకం



స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రికి అనుబంధంగా కొండపై కొలువైన శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం విశేష పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. మహాశివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన తదితర పూజలు గావించారు. ఆయవ వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారున ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, ఆరాధన, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకారం మండపం, ముఖ మండపంలో నిత్యాకల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహించి శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

ప్రకృతి పరిరక్షణతోనే మానవాళి మనుగడ



మొక్క నాటుతున్న దుశ్చర్ల సత్యనారాయణ

రామన్నపేట : ప్రకృతి పరిరక్షణతోనే మానవాళికి మనుగడ అని జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామంలో మొక్కలు నాటారు. ప్రకృతి పరిరక్షణకు కృషి చేస్తామని స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయనాలతో భూ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. దేశంలో సహజ వనరుల వినియోగం అదుపు తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మేదరి కిరణ్‌కుమార్, వేముల సైదులు, మెట్టు మధు, రాధ, అజ్మద్, అర్జున్, నవ్య, యాదయ్య, బాలక్రిష్ణ, విజయలక్ష్మి, సైదమ్మ, కనకమ్మ, యశోద, అనిత, అఖిల సరిత, నర్మద, అశ్విని పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్ షో ఏర్పాట్ల పరిశీలన



భువనగిరిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

భువనగిరి : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈనెల 25న భువనగిరిలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను సోమవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. పార్టీ నాయకులతో కలిసి వినాయక చౌరస్తా నుంచి బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వరకు నడుచుకుంటూ ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ అంజనేయులు, పార్టీ పట్టణ, మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చిరంజీవి, నర్సింగ్ రావు, సుభాస్, నగేష్ తదితరులు ఉన్నారు.

కష్టం.. వర్షార్పణం

అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం

- నేలవాలిన వరి, రాలిన మామిడి
- పలు ప్రాంతాల్లో విరిగిపడిన చెట్లు, కూలిన విద్యుత్ స్తంభాలు
- పిడుగుపాటుకు పశువులు మృతి



కూరెల్లలో వాన నీటిలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతులు

సాక్షి, యాదాద్రి : కరువుతో నష్టపోయిన అన్నదాతకు.. అకాల వర్షం మరింత నష్టాన్ని మిగిల్చింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఈదురు గాలులకు కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరు నేలవాలగా.. చేతికొచ్చిన మామిడి కాయలు రాలిపోయాయి. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడగా.. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. పిడుగుపాటుకు పశువులు మృతి చెందాయి.

ధాన్యం తరలింపులో జాప్యం

కేంద్రాలు ప్రారంభించి 20 రోజులు గడిచినా ధాన్యం కొనుగోళ్ల వేగం పుంజుకోవడం లేదు. కొన్నిచోట్ల కాంటా వేసినా ధాన్యం మిల్లులకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా 323 కేంద్రాలు ఏర్పాటు చేయగా సోమవారం నాటికి 3,801 మంది రైతుల నుంచి 49,542 మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేశారు. ఇందులో 43, 235 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించారు. ఇంకా 6,306 మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాల్లోనే ఉంది. హమాలీల కొరత, రవాణా సమస్యలు, మిల్లుల వద్ద అన్‌లోడ్ చేయడంలో జరుగుతున్న జాప్యం కారణంగా రైతులు నష్టపోవల్సి వస్తుంది.

జరిగిన నష్టం ఇలా..

- ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాలు, కల్లాల్లో ధాన్యం రైతుల కళ్లెదుటే వాన నీటికి కొట్టుకుపోయింది. గుండాల మండల కేంద్రంలో బండమీద ఆరబోసి ధాన్యం పక్కనే ఉన్న రామసముంద్రం చెరువులోకి కొట్టుకుపోయింది.
- మోత్కూరు, రామన్నపేట వ్యవసాయ మార్కెట్ యార్డులు, ఆత్మకూర్(ఎం) మండలంలోని కొనుగోలు కేంద్రాల్లోనూ రైతులు ఆరబెట్టిన, కాంటా వేసిన ధాన్యం చలా వరకు తడిసింది. ధాన్యం రాశుల మధ్య నిలిచిన నీటిని తొలగించడానికి రైతులు శ్రమించవలసి వచ్చింది. తడిసిన ధాన్యానిన కొనుగోలు చేయాలని ఆత్మకూర్(ఎం)లో రైతులు ఆందోళనకు దిగారు.
- ఈదురుగాలులకు రాజాపేట, మోత్కూరు, గుండాల మండలాల్లో చేతికొచ్చిన మామిడి కాయలు నేలరాలాయి. సుమారు 123 ఎకరాల్లో మామిడికి నష్టం వాటిల్లింది. పలు చోట్ల కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు నేలవాలాయి.
- గుండాల మండలం పెద్దపడిశాల, అడ్డగూడూరు మండలం కంచనపల్లిలో పిడుగుపాటుకు రెండు పశువులు మృతి చెందాయి.
- మోత్కూరు మండలం పొడిచేడులో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. బుజిలాపురంలో ఈదురు గాలులకు రేకుల షెడ్డు ధ్వంసమైంది. అకాల వర్షాలకు జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేసే పనిలో నిమగ్నం అయ్యారు.



వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆత్మకూర్(ఎం) సబ్ మార్కెట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు



గుండాల మండలం బ్రాహ్మణపల్లిలో నేలరాలిన మామిడి కాయలు



ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేట కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు

కొనుగోళ్లలో వేగం పెంచండి



అధికారులు, మిల్లర్ల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భువనగిరిటౌన్ : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోమ్ ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో అధికారులు, మిల్లర్లతో సమావేశమై ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటా వేసి ఏరోజు కారోజు మిల్లులకు తరలించాలని సూచించారు. రవాణా సమస్య తలెత్తకుండా చూడాలని, మిల్లుల వద్ద ఎక్కువ మంది హమాలీలను నియమించుకొని ధాన్యాన్ని అన్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కాంటా వేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందజేయాలని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తినట్లయితే జిల్లా పౌర సరఫరాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్‌కు 79951 20554కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. సోమవారం నాటికి 3,801 మంది రైతుల నుంచి 49,543 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ కృష్ణ, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌర సరఫరాలు, మార్కెటింగ్, సహకారశాఖ అధికారులు శ్రీనివాసరెడ్డి, సబిత, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మార్త వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కోట మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజు 11మంది నామినేషన్లు

భువనగిరి టౌన్ : లోక్‌సభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా సోమవారం 11 మంది అభ్యర్థులు 14 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్, పీపుల్స్ ప్రొటెక్షన్ తరపున వింద్యాల సదానందరెడ్డి, స్వతంత్ర అభ్యర్థి ఈదుల వీర పాపయ్య రెండు సెట్ల చొప్పున నామినేషన్లు వేశారు. వీరితో పాటు జై భారత్ నేషనల్ పార్టీ నుంచి నల్ల కరుణాకర్‌రెడ్డి, ఇండిపెండెంట్‌లు భాష బోయిన లక్ష్మయ్య, వరికుప్పల కృష్ణ, కొంగరి మల్లయ్య, గాదేపాక అనిల్‌కుమార్, నక్కల సురేందర్, తెలంగాణ రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి కందాడి మణిపాల్‌రెడ్డి, ధర్మ సమాజ్ పార్టీ నుంచి కొంగర లింగస్వామి ఒక్కో సెట్ నామినేషన్ వేశారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరించారు.

నల్లగొండలో 10 మంది..

నల్లగొండ: నల్లగొండ లోక్‌సభ స్థానానికి సోమవారం 10 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ తరఫున శానంపుడి సైదిరెడ్డి, ఆధార్ పార్టీ (అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫన్స్ పార్టీ) నుంచి ఏడనాగ్ పుల్లారావు, ఎంసీపీఐ వసుకుల మట్టయ్య, తెలంగాణ సకల జనుల పార్టీ నందిపాటి జానయ్య, రిపబ్లిక్ పార్టీ వంగపల్లి కిరణ్, ధర్మసమాజ్ పార్టీ తలారి రాంబాబు నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా పానుగోతు లాల్ సింగ్, మర్రి నెహేమియా, చీదల్ల వెంకటసాంబశివ రావు, లింగం కృష్ణ ఉన్నారు. ఇందులో బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి తలారి రాంబాబు, ఎంసీపీఐ అభ్యర్థి వసుకుల మట్టయ్యలు రెండోసారి నామినేషన్లు వేశారు. రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ హరిచందన్ నామినేషన్లను స్వీకరించారు. కాగా, నాలుగో రోజుల్లో మొత్తం 22 నామినేషన్లు దాఖలయ్యాయి.



నల్లగొండలో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

మెడికల్ కళాశాల భవనం మార్పు

- తక్కువ విస్తీర్ణంలో పాత కలెక్టరేట్
- జాతీయ వైద్య మండలి ఆదేశాల మేరకు మరో చోట భవనాల పరిశీలన

భువనగిరి : జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాల నిర్వహణకు తాత్కాలికంగా ఎంపిక చేసిన భవనాన్ని మార్పు చేశారు. నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో జాతీయ వైద్యమండలి ఆదేశాల మేరకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. మరో చోట భవనాలను పరిశీలిస్తున్నారు.

తొలుత పాత కలెక్టరేట్ ఎంపిక

మెడికల్ కళాశాల ఏర్పాటు కోసం భువనగిరి మండలంలోని పగిడిపల్లిలో గల పాత కలెక్టరేట్ భవనాన్ని అధికారులు తాత్కాలికంగా ఎంపిక చేశారు. అయితే ఈ భవన సముదాయం 55 వేల ఎస్ఎఫ్‌టీలు మాత్రమే ఉంది. మెడికల్ కళాశాల నిర్వహించాలంటే జాతీయ వైద్య మండలి నిబంధనల ప్రకారం కనీసం లక్ష నుంచి 1.30 లక్షల ఎస్ఎఫ్‌టీల వరకు ఉండాలి. కానీ, పాత కలెక్టరేట్ విస్తీర్ణం చాలా తక్కువగా ఉన్నందున కళాశాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని జాతీయ వైద్య మండలి అధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. వారి సూచన మేరకు భవనాన్ని మార్పు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం సంబంధిత అధికారులు భువనగిరి పట్టణ పరిసరాల్లో అనువైన భవనాల కోసం వెతుకుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని అనంతారం గ్రామ సమీపంలో ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ, రాయగిరి పరిధిలో గల ఇంజనీరింగ్ కళాశాల భవనాలను పరిశీలిస్తున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు.

కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత లేదు

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి, చిత్రంలో అభ్యర్థి క్యామ మల్లేష్, పైళ్ల, ఉమా మాధవరెడ్డి, చింతల

భువనగిరి : కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత కోమటిరెడ్డి బ్రదర్స్‌కు లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం భువనగిరిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కాలిగోటికి కూడా కోమటిరెడ్డి బ్రదర్స్ పనికిరారన్నారు. రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పంటలు ఎండిపోయి రైతులు దిక్కుతోచిన స్థితిలో ఉన్నా ఇప్పటి వరకు మంత్రులు వారి ముఖం చూడలేదన్నారు. భువనగిరిలో జరిగిన రోడ్ షోలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన తీరును బట్టి చూస్తే లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదని ముందుగానే ఒప్పుకున్నట్లుందన్నారు. ప్రజలకు చెప్పుకోవడానికి కాంగ్రెస్‌కు ఏమీ లేక కేసీఆర్‌ను తిడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 120 రోజులు అవుతున్నా రాష్ట్రంలో పాలన ఉన్నట్లు లేదన్నారు. అసలు సీఎం ఉన్నాడా? లేడా? అనిపిస్తుందన్నారు. ఎక్కడైనా అధికార పార్టీపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తాయని, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్, బీజేపీలు కేసీఆర్‌ను తిడుతున్నాయన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఎప్పుడైనా హీరోనే అని పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డిని పార్టీ కార్యకర్తలే తిట్టే రోజులు వస్తాయి : క్యామ మల్లేష్

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి వీధి రౌడీలా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌యాదవ్ అన్నారు. రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ కార్యకర్తలే తిట్టే రోజులు వస్తాయన్నారు. మోదీ సర్కార్ గుళ్లు, మతం పేరుతో ఓట్లు దండుకోవడం తప్ప.. దేశానికి చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ శ్రేణులు కలిసికట్టుగా తన గెలుపుకోసం కృషి చేయాలని కోరారు. తనను గెలిపిస్తే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో కొట్లాడి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకువస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్, చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్యగౌడ్, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్లురెడ్డి, పార్టీ పట్టణ, మండల కమిటీఅధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, మర్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ జెడ్పీటీసీలు, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు, భువనగిరి, ఆలేరు, జనగాం, ఇబ్రహీంపట్నం, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి రెండు సెట్లు దాఖలు

- ఉదయం, మధ్యాహ్నం వేర్వేరుగా నామినేషన్ వేసిన క్యామ మల్లేష్



మధ్యాహ్నం నామినేషన్ వేస్తున్న క్యామ మల్లేష్, చిత్రంలో జగదీష్‌రెడ్డి తదితరులు

సాక్షి, యాదాద్రి : బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ సోమవారం రెండుసెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఉదయం ఒక సెట్, మధ్యాహ్నం రెండో సెట్ వేశారు. శుభఘడియలు ఉన్నాయని 11 గంటలలోపు మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. మధ్యాహ్నం రెండవ సెట్‌ను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, భువనగిరి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్యతో కలిసి వచ్చి నామినేషన్ వేశారు.

కోడ్ ఉల్లంఘన

బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ నామినేషన్ సందర్భంగా ఆ పార్టీ నాయకులు కోడ్ ఉల్లంఘించారు. ఉదయం నామినేషన్ వేయడానికి ముందు 10 గంటలలోపే పలువురు నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్‌లోకి వచ్చి వేచి ఉన్నారు. అభ్యర్థి నామినేషన్ వేయడానికి రిటర్నింగ్ అధికారి కార్యాలయం లోపలికి వెళ్తుండగా వారంతా ఆయన వెంట గుంపులుగా వచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అభ్యర్థితో పాటు ఆయన వెంట మరో నలుగురిని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతించారు. మిగతావారిని అడ్డుకున్నారు. మధ్యాహ్నం రెండో సెట్ నామినేషన్ దాఖలు చేసే సమయంలోనూ నిబంధనలు అతిక్రమించారు. సూర్యాపేట, జనగామ ఎమ్మెల్యేలు జగదీష్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్యతో కలిసి క్యామ మల్లేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా కార్ల కాన్వాయ్‌తో పాటు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్‌లోకి చొచ్చుకువచ్చారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల వరకు ఎవరినీ అనుమతించరు. అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే లోపలికి అనుమతిస్తారు.మూడు వాహనాల వరకు మాత్రమే లోపలికి అనుమతి ఉంటుంది. కానీ, బీఆర్ఎస్ అభ్యర్థి వెంట పెద్ద సంఖ్యలో నాయకులు కలెక్టరేట్‌లోకి వచ్చారు. ఈ ఘటనపై రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే విచారణకు ఆదేశించారు.



కలెక్టరేట్ గేట్ వద్ద బీఆర్ఎస్ నాయకులు పార్కింగ్ చేసిన కార్లు, అక్కడే ఉన్న పోలీసులు

చూస్తూ నిలబడ్డ పోలీసులు!

రిటర్నింగ్ కార్యాలయం వద్ద 100 మీటర్ల దూరం వరకు మూడు వాహనాలు, అభ్యర్థి వెంట నలుగురికే అనుమతి ఇస్తారు. కానీ, బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ సదర్భంగా పెద్ద సంఖ్యలో నాయకులు కలెక్టరేట్‌లోకి రావడం చర్చనీయాంశమైంది. నామినేషన్ల సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఉంటుంది. అయినా బీఆర్ఎస్ నాయకులు కోడ్ ఉల్లంఘించడం పోలీసులు వైఫల్యమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



నామినేషన్ వేయడానికి కలెక్టరేట్‌లోకి అభ్యర్థి వెంట గుంపుగా వస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కలెక్టరేట్‌లోని సమావేశ మదిరంలోకి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

అనాథ బాలికలకు పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి ఆహ్వానం

భువనగిరిటౌన్ : హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఎటువంటి అర్హత పరీక్ష లేకుండా ప్రవేశం పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ ఇన్‌చార్జి అధికారి చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, నిరుపేదలు, తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి, అక్రమ రవాణాకు గురైన బాలికలు అర్హులని పేర్కొన్నారు. 10వ తరగతి పూర్తయిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అనాథ బాలికలకు కుల ధ్రువీకరణ పత్రం అవసరం లేదన్నారు.

పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలి

- డీఆర్‌డీఓ కృష్ణన్

భువనగిరి రూరల్ : వేసవి దృష్ట్యా ఉపాధిహామీ పనులు జరిగే ప్రదేశాల్లో నీడ, నీటి సౌకర్యం కల్పించడంతో పాటు మెడికల్ కిట్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని డీఆర్‌డీఓ కృష్ణన్ సూచించారు. సోమవారం భువనగిరి ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమై ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. గ్రామాల అభివృద్ధికి దోహదపడే పనులను గుర్తించాలని, ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తుండాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు దినసరి వేతనం రూ.300 గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని పేర్కొన్నారు. కొలతల ప్రకారం పనులు చేయించడంతో పాటు కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్ కుమార్, డీఎల్‌పీఓ శ్రీకాంత్ రెడ్డి, భువనగిరి, ఆత్మకూర్ ఎంపీడీఓలు శ్రీనివాస్, నిరంజన్‌వలి, ఎంపీఓలు అనురాధ, పద్మావతి, ఏపీఓలు బాలస్వామి, జి.రమేష్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



బీజేపీ భారీ ర్యాలీ

- నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డు నుంచి క్లాక్‌టవర్ వరకు బైక్ ర్యాలీ
- హాజరైన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి నామినేషన్ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డు నుంచి గడియారం సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీకి కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్లాక్‌టవర్ సెంటర్‌లో జనసందోహం నెలకొంది. ఈ సందర్భంగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రసంగం కార్యకర్తల్లో జోష్ నింపింది. కార్యకర్తలు నినాదాలు, ఈలలతో సభ హోరెత్తించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, నూకల నరసింహారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజు యాదవ్, పోతెపాక సాంబయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శానంపూడిని గెలిపిస్తే ఇండస్ట్రియల్ కారిడార్

దేశం కోసం మోదీ అని, నల్ల గొండ కోసం సైదిరెడ్డి అని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలుగులో ప్రసంగం మొదలుపెట్టారు. శానంపూడి సైదిరెడ్డిని ఎంపీగా గెలిపిస్తే జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

భారీ మెజార్టీతో గెలవబోతున్నా..

తాను నల్లగొండ ఎంపీగా భారీ మెజార్టీతో గెలవబోతున్నానని బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ప్రమాణం చేస్తున్నారని, కాంగ్రెస్ అంటేనే స్కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు. మూడు కుటుంబాలు జిల్లాను ఏలుతున్నాయని, కానీ జిల్లా మాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. కుటుంబ పాలన కావాలో, అభివృద్ధి చేసే మోదీ కావాలో ప్రజలు ఆలోచన చేయాలని కోరారు.



నల్లగొండ పట్టణంలో శానంపూడి సైదిరెడ్డి నామినేషన్ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు (ఇన్‌సెట్లో) కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు భారీ గజమాలతో సన్మానం

నల్లగొండలో కాషాయ జెండా ఎగరాలి

బీజేపీ కార్యకర్తల ఉత్సాహం చూస్తే కాంగ్రెస్‌కు దడ పుడుతోందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఇక్కడ బీజేపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎమ్మెల్యేలు లేకున్నా ప్రధాని మోదీ జిల్లాకు జాతీయ రహదారులు ఇచ్చారని తెలిపారు. నల్లగొండలో కాషాయం జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఒక్కొక్కరు వంద ఓట్లు వేయిస్తే సైదిరెడ్డి 2లక్షల మెజార్టీతో గెలుస్తారన్నారు. జిల్లాలో ఉత్తమ్, జానారెడ్డి, కోమటిరెడ్డిల కుటుంబ పాలనకు స్వస్తి చెప్పాలన్నారు.



క్లాక్‌టవర్ సెంటర్‌లో మీటింగ్‌కు హాజరైన బీజేపీ కార్యకర్తలు

ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకులదే కీలకపాత్ర



శిక్షణకు హాజరైన సూక్ష్మ పరిశీలకులు

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకులదే కీలకపాత్ర అని ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రవణ్ అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని జిల్లా పరిషత్ ఆడిటోరియం హాల్‌లో సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొదటి విడతలో భాగంగా 374మంది సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల్లో పాటించాల్సిన నియమ నిబంధనలను ఆయన వివరించారు. పోలింగ్ అయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ పోలింగ్ రోజున ఎన్నికల పరిశీలకులకు చెక్ లిస్ట్‌లో అన్ని వివరాలు రిపోర్ట్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎల్డీఎం శ్రామిక్, మాస్టర్ ట్రైనర్ బాలు, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైదిరెడ్డి ఆస్తులు రూ.31.33 కోట్లు

నల్లగొండ: నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తన కుటుంబ ఆస్తులు రూ.31,33,55,479గా ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో చూపించారు. అదేవిధంగా రూ.6,10,9,131 అప్పులు ఉన్నట్లు పేర్కొన్నారు. సోమవారం నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేశారు. తన చేతిలో రూ.45వేల నగదు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ డీసీసీబీ బ్యాంకులో రూ.7,97,650, యూనియన్ బ్యాంకులో రూ.3,60,940, ఎస్‌బీఐలో రూ.18,17,072, ఐసీఐసీఐ బ్యాంకులో రూ.10లక్షల డిపాజిట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపించారు. తన భార్య చేతిలో రూ.45వేల నగదు, హైదరాబాద్‌లోని డీసీసీబీ బ్యాంకులో రూ.2,95,719 డిపాజిట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. డిపెండెంట్–1 పేరున రూ.22,800, డిపెండెంట్–2 పేరున రూ.30,895 బ్యాంకుల్లో ఉన్నట్లు చూపించారు. సైదిరెడ్డి పేరున రూ.50వేల విలువ చేసే షేర్లు, ఆయన భార్య పేరున మరో రూ.50వేల విలువ చేసే షేర్లు చూపించారు. ఎస్‌జీ పవర్ ప్రాజెక్టులో తన భార్య పేరున రూ.1,57,43,752 విలువ చేసే పెట్టుబడులు ఉన్నట్లు పేర్కొన్నారు. సైదిరెడ్డి వద్ద 270 గ్రాముల బంగారం ఉన్నట్లు చూపగా, తన భార్య వద్ద కిలోన్నర బంగారం ఉన్నట్లు చూపించారు.

అప్పులు రూ.6.10 కోట్లు..

సైదిరెడ్డి పేరున చరాస్తి రూ.5,34,01850 ఉన్నట్లు చూపగా.. తన భార్య పేరున రూ.15,62,80,000 స్థిరాస్తి ఉన్నట్లు చూపించారు. అప్పులు సైదిరెడ్డి పేరున రూ.91 లక్షలు. తన భార్య పేరున రూ.5,19,9,131 ఉన్నట్లు చూపించారు.

స్థిర, చరాస్తులు..

సైదిరెడ్డి పేరున చరాస్తులు రూ.4,47,52,548, తన భార్య పేరున చరాస్తులు రూ.5,89,21,081 ఉన్నట్లు చూపారు. సైదిరెడ్డికి సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో 2.25 ఎకరాలు, మరో చోట 1.30 ఎకరాలు, 1.29 ఎకరాలు, సూర్యాపేట జిల్లా చివ్వెంలలో 3 ఎకరాల భూమి ఉన్నట్లు చూపించారు. దురాజ్‌పల్లిలో ఒక చోట 7,200 స్క్వేర్ యార్డ్స్, మరో చోట 31,366 స్క్వేర్ యార్డ్స్, కోదాడలో 409.5 స్క్వేర్ యార్డ్స్ స్థలం ఉన్నట్లు చూపగా టీవీబీ పాలెంలో 438 స్క్వేర్ యార్డ్స్ స్థలంతో పాటు కెనడాలో 2 నివాస భవనాలు ఉన్నట్లు పేర్కొన్నారు. తన భార్య పేరున షామీర్‌పేటలోని దేవరయాంజాల్‌లో 9వేల స్క్వేర్ యార్డ్స్ భవనంతో పాటు సూర్యాపేటలోని దేశాయిగూడెంలో 12,221 స్క్వేర్ యార్డ్స్ స్థలం ఉంది.

క్యామ మల్లేష్‌పై పోలీసు కేసులు లేవు

- ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి
- రూ.145 కోట్ల స్థిర, చరాస్తులు

సాక్షి, యాదాద్రి: తనపై ఎటువంటి పోలీసు కేసులు లేవని బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ తన ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సోమవారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. అఫిడవిట్‌లో తనతో పాటు తన భార్య జంగమ్మ పేరు మీద స్థిరాస్తులు రూ.3,36,16,521, చరాస్తులు 141,98,76,000 ఉన్నట్లు పేర్కొన్నారు. అందులో మల్లేష్ పేరున స్థిరాస్తులు రూ.2,15,79,701 కాగా, భార్య జంగమ్మ పేరు మీద రూ.1,20,36820 ఉన్నట్లు చూపించారు. చరాస్తులు తన పేరు మీద రూ.116,98,76,000, భార్య పేరుపై రూ.25 కోట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మల్లేష్ పేరు మీద అప్పు రూ.48,30,037, భార్య పేరు మీద రూ.15,16,459 అప్పుగా చూపించారు. మల్లేష్ చేతిలో రూ.60,000. తన భార్య చేతిలో రూ.40,000 నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎల్‌ఐసీ పాలసీలు తన పేరు మీద రూ.14.50 లక్షలు, భార్య పేరుపై రూ.2లక్షలు ఉన్నాయని, రూ.7లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు మల్లేష్ పేరున, కిలో బంగారం భార్య పేరున ఉందని పేర్కొన్నారు. టయోటా, మెర్సిడెస్ బెంజ్ కార్లు మల్లేష్ పేరున, మరో ఇన్నోవా కారు భార్య పేరున ఉంది.

తెలంగాణ ప్రజల కోసం కొట్లాడేది కేసీఆరే



కొండమల్లేపల్లి రోడ్ షోలో మాట్లాడుతున్న కంచర్ల కృష్ణారెడ్డి



పెద్దవూరలో బీఆర్‌ఎస్ ప్రచార సభకు హాజరైన పార్టీ నాయకులు

- మోసపూరిత హామీలతో కాంగ్రెస్ మభ్యపెడుతోంది
- బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

కొండమల్లేపల్లి: తెలంగాణ ప్రజల కోసం కొట్లాడేది కేసీఆరే అని.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన రోడ్ షోలో వారు పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మాటలు సీఎం హోదాకు తగ్గట్టుగా లేదని, కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు తరలించుకుపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తాను రైతు బిడ్డనని, రైతు కష్టాలు తెలిసిన వ్యక్తినని పేర్కొన్న కంచర్ల కృష్ణారెడ్డి.. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ హామీల పట్ల ప్రజలు ఆలోచించాలని, కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో బడుగుల లింగయ్యయాదవ్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎడారిగా మార్చిన కాంగ్రెస్

పెద్దవూర: అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే సాగర్ జలాశయంలో నీరు ఉన్నా ఆయకట్టును ఎడారిగా మార్చిన కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పెద్దవూర మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ.. నాలుగు నెలల పరిపాలనలో కాంగ్రెస్ చేసింది శూన్యమన్నారు. బీఆర్‌ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలు రావాలంటే కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, ట్రికార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నాయకులు విజయేందర్‌రెడ్డి, సుందర్‌రెడ్డి, రవినాయక్, లింగయ్య, అబ్బాస్, శ్రీనివాస్, డి. శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదులకు వ్యతిరేకంగా సీపీఎం పోరాటం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

చండూరు: అవకాశ, మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడేది ఎర్రజెండానే అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం చండూరు మండలంలోని బోడంగిపర్తి, తాస్కానిగూడెం, చండూరు, బంగారిగడ్డ, దోనిపాముల, నెర్మట, కొండాపురం, గట్టుప్పల్, తేరట్‌పల్లి, వెల్మకన్నె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి నిరుద్యోగాన్ని పెంచి పోషించిందన్నారు. ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడే ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ గట్టుప్పల్ మండల వ్యాప్తంగా ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేసే వరకు ఉద్యమిస్తామన్నారు. మునుగోడు ప్రాంతంలో ఇల్లు లేని నిరుపేదల కోసం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, సాగునీరు, తాగునీరు కోసం అనేక ఉద్యమాలు చేపట్టిన చరిత్ర సీపీఎంకు ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, వెంకటేష్, కట్ట నరసింహ, అయితగోని విజయ్ కుమార్, నన్నూరి వెంకట రమణారెడ్డి, తుమ్మల పద్మ, మన్నె భిక్షం, శ్రీను, వల్లూరి శ్రీశైలం, బండారి కృష్ణయ్య, బండా నరేందర్, గిరి భిక్షం, కానుగుల నరసింహ, పోలే సత్యనారాయణ, జెర్రిపోతుల ధనంజయగౌడ్ పాల్గొన్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న రంగారెడ్డి

కొనసాగుతున్న నామినేషన్ల దాఖలు



నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ఆధార్ (అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్) పార్టీ అభ్యర్థి ఏదనాగ్ పుల్లారావు



నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా ఎంసీపీఐ(యూ) పార్టీ తరఫున నామినేషన్ వేస్తున్న వసుతుల మట్టయ్య



ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న తలారి రాంబాబు

బాలుడి మృతదేహానికి రీపోస్టుమార్టం

భువనగిరి క్రైం: మండలంలోని రెడ్డినాయక్ తండాకు చెందిన భుక్య భానుప్రకాష్, శైలజ దంపతుల కుమారుడు భుక్య విక్రం(22 నెలలు) ఇంటి ముందు ఉన్న సంపులో పడి ఈ నెల 11వ తేదీన మృతిచెందాడు. అదే రోజు బాలుడి మృతదేహాన్ని ఖననం చేశారు. బాలుడి తండ్రి భానుప్రకాష్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ కేసు నమోదు చేశారు. సోమవారం తహసీల్దార్ అంజిరెడ్డి, డాక్టర్ స్వప్న, రూరల్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఐ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో బాలుడి మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించారు.



రీపోస్టుమార్టం నిర్వహిస్తున్న పోలీసులు

యాదాద్రిలో తెరుచుకున్న ఆండాళ్ అమ్మవారి ఆలయ ద్వారాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయంలో ఆండాళ్ అమ్మవారి ఆలయ ద్వారాలను అధికారులు తెరిచి, భక్తులకు దర్శనం కల్పించారు. ప్రధానాలయ పునర్నిర్మాణంలో భాగంగా ఉప ఆలయాలను తొలగించారు. తిరిగి గర్భాలయంలో శ్రీస్వామిని దర్శించుకొని వచ్చే మార్గంలో ఆండాళ్ అమ్మవారి ఉప ఆలయాన్ని నిర్మించారు. ప్రధానాలయ ఉద్ఘాటన జరిగి, శ్రీస్వామి వారి దర్శనం ప్రారంభమైనప్పటికీ ఉప ఆలయంలో ఉన్న ఆండాళ్ అమ్మవారి ఆలయ ద్వారాలు తీయకుండానే భక్తులకు దర్శనం కల్పించే వారు. కానీ భక్తుల కోరిక మేరకు మూడు రోజుల క్రితం ఈఓ భాస్కర్‌రావు ఆండాళ్ అమ్మవారి ఆలయ ద్వారాన్ని తెరిపించారు. అదేవిధంగా యాదాద్రి కొండపై గల బస్టాండ్‌లో ఉన్న సెల్‌ఫోన్ కౌంటర్ పక్కనే భక్తుల కోసం సమాచార కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. దర్శనం, పూజా సమయాలు, టికెట్ల ధరలు, ప్రసాద విక్రయశాల, ప్రధాన బుకింగ్ కౌంటర్, ధర్మ దర్శనం, వీఐపీ దర్శనం, బ్రేక్ దర్శనాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఈ సమాచార కేంద్రంలో భక్తులకు వివరించేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఒకటి, రెండు రోజుల్లో ఈ సమాచార కేంద్రాన్ని ప్రారంభించనున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

యాదగిరిగుట్ట: పట్టణంలోని ఓ ప్రైవేట్ లాడ్జీలో గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. యాదగిరి పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణంలోని ఎంవీఆర్ లాడ్జీలోని గదిలో ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో ముగ్గురు పురుషులు, మహిళ, చిన్నారి దిగారు. రాత్రి 11గంటల సమయంలో లాడ్జీ నిర్వాహకులకు చెప్పకుండా ఇద్దరు పురుషులు, మహిళ, చిన్నారితో కలిసి వెళ్లిపోయారు. ఆ సమయంలోనే వీరితో వచ్చిన సుమారు 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెంది గదిలో ఉన్నాడు. వెంటనే లాడ్జీ నిర్వాహకుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేష్ వెల్లడించారు. కాగా.. లాడ్జీలో బస చేయడానికి వచ్చిన సమయంలో వారి నుంచి ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్, అడ్రస్ ప్రూఫ్ వంటివి ఏమీ లాడ్జీ నిర్వాహకులు తీసుకోలేదు. దీంతో మృతుడి వివరాలు, అడ్రస్ తెలుసుకునేందుకు పోలీసులకు ఇబ్బందిగా మారింది. అసలు ఆ వ్యక్తిని ఎవరైనా ఇక్కడికి తీసుకువచ్చి చంపేశారా.. లేదా ఆ వ్యక్తే ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయాలు తెలియాల్సి ఉంది.

పరీక్ష ఫీజు తీసుకోవడం లేదని..

- ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన విద్యార్థులు
- కలెక్టర్ ఎన్నికల విధుల్లో ఉండడంతో వారిని అడ్డుకున్న పోలీసులు



కలెక్టరేట్ వద్ద విద్యార్థులను తిరిగి వెనక్కి పంపిస్తున్న పోలీసులు

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులు తమ పరీక్షలకు సంబంధించిన ఫీజును కళాశాల యాజమాన్యం తీసుకోవడం లేదని ఆరోపించారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి ఈ విషయాన్ని తెలిపేందుకు కలెక్టరేట్‌కు రాగా.. కలెక్టర్ ఎన్నికల విధుల్లో ఉండడంతో పోలీసులు వారిని లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు సోమవారం చివరి తేదీ ఉందని, కానీ కళాశాల యజమాన్యం పరీక్ష ఫీజు తీసుకోవడం లేదని, ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలిపేందుకు వస్తే, పోలీసులు కలెక్టరేట్‌లోనికి పోనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 3 గంటల తరువాత రావాలని పోలీసులు సూచించారని, ఆ సమయానికి కళాశాల టైమింగ్ కూడా అయిపోతుందని పేర్కొన్నారు. 23వ తేదీ నుంచి పరీక్ష ఫీజును ఫైన్ ద్వారా చెల్లించాల్సి వస్తుందని వాపోయారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రణీత, వర్ష, హరీష్, క్రాంతికుమార్, దుర్గాప్రసాద్, గణేష్, శ్రీశైలం, రాహుల్, నితిన్, మణికంఠ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు.. ఇద్దరు మృతి



మహేందర్ (ఫైల్)




లచ్చు (ఫైల్)

పెద్దవూర: ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం రాత్రి పెద్దవూర మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలం పంగవానికుంట గ్రామానికి చెందిన నీలం మహేందర్(21) బైక్‌పై గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లి ఆదివారం రాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో కొండమల్లేపల్లి మండలం కొత్రోనితండాకు చెందిన నేనావత్ లచ్చు (35) పెద్దవూర వైపు నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. లచ్చు బైక్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ పెద్దవూర మండల కేంద్రంలోని విశ్వనాథ్ స్పిన్నింగ్ మిల్లు సమీపంలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై మల్లేపల్లి వైపు నుంచి వస్తున్న మహేందర్ బైక్‌ను ఎదురుగా ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ బైక్‌ల పైనుంచి ఎగిరి రోడ్డుపై పడిపోయారు. ఇద్దరి తలకు తీవ్రగాయాలయ్యాయి. నీలం మహేందర్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మహేందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నేనావత్ లచ్చును చికిత్స నిమిత్తం 108 వాహనంలో నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. లచ్చు పరిస్థితి విషమంగా ఉండటంతో నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు నీలం మహేందర్ అవివాహితుడు కాగా పంగవానికుంట గ్రామంలో కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నేనావత్ లచ్చుకు భార్య మంజుల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు మహేందర్ సోదరుడు భిక్షం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. వీరబాబు తెలిపారు.

హత్య కేసులో జీవిత ఖైదు

భువనగిరి క్రైం, తుర్కపల్లి: తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి హత్య కేసులో జీవిత ఖైదు విధిస్తూ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు తీర్పు వెల్లడించారు. 2021 డిసెంబర్ 24న ఎర్రబెల్లి వెంకటేశం తన భార్య కృష్ణవేణితో గొడవపడుతుండగా ఆమె అన్న రాచకొండ రమేష్(36) తన చెల్లితో ఎందుకు గొడవ పడుతున్నావని అడిగాడు. వెంకటేశం కోపంతో రమేష్‌పై ఇటుకతో దాడిచేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతనిని చికిత్స నిమిత్తం భువనగిరికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రమేష్ భార్య అనిత తుర్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ నవీన్‌రెడ్డి, ఎస్సై మధుబాబు కేసు విచారణ నిర్వహించారు. నేరం రుజువు కావడంతో వెంకటేశంకు జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధిస్తూ యాదాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.జయరాజు తీర్పు వెలువరించారు. ఈ కేసు విచారణలో శ్రీనివాస్‌రెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించారు.



వెంకటేశం

కేవీకే స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలి

త్రిపురారం: మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కంపాసాగర్‌లో త్వరలో నిర్వహించనున్న తొలి కేవీకే స్వర్ణోత్సవాలను రైతులు విజయవంతం చేయాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస రావు సోమవారం కోరారు. సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 16 కేవీకేల్లో మొదటి కేవీకే స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని కంపాసాగర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే కంపాసాగర్ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.